క్లుప్తంగా

'హ్యూమన్ రైట్స్' సభ్యత్వం అందుకున్న సురేష్

భట్టిప్రోలు: మండలంలోని పెసర్లంకకు చెందిన యన్నం సురేష్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ పీపుల్స్ సభ్యత్వం పొందారు. సోమవారం రేపల్లెలోని కార్యాలయంలో నేషనల్ కో-ఆర్డినేటర్ పి. సాంబశివరావు చేతుల మీదగా సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నిర్వాహకులు ఎ.నరసింహారావు, డి. నాగేశ్వరరావు, కె.సుమత్, పి.ప్రభాకర్, సీహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కర్లపాలెం: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కర్లపాలెం శాఖ గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక పఠనం అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలలో ఉన్న విలువైన పుస్తకాలను చదవటం ద్వారా విద్యార్థులు పఠనా శక్తిని పెంపొందించుకోవటంతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకోవచ్చునని చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్లపాలెం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 8గంటల విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కర్లపాలెం, బుద్ధాం, నందాయపాలెం, ఎంవీ రాజుపాలెం, యాజలి, ఏట్రావారిపాలెం, నల్లమోతువారిపాలెం, దమ్మనవారిపాలెం, బోలాయపాలెం, దుండివారిపాలెం, నందాయపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు రేపటి నుంచి

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి హనుమజ్జయంతి వార్షిక ఉత్సవాలు ప్రారంభించడం జరుగుతుందని అర్చకులు శ్రీనివాసమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పండితులు దీవి లక్ష్మీనరసింహచార్యులు పర్యవేక్షణలో ఏకాదశ దీక్షతో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు ఉదయం ఉదయం స్వామి వారికి గంగ సిందూర లేపన పుజా కార్యక్రమం, జూన్ 1న హనుమజ్జయంతి పర్వదినం రోజు వరకు ప్రతి రోజు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, సిందూరార్చన, చందనాభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్ర పవిత్ర పుష్ప పత్ర పూజ, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు అధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 31న సాయంత్రం వికనాచార్య స్వామి సుందర కాండలో హనుమంతుని పాత్ర అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమర్తలూరు(వేమూరు): కొంత కాలం అనారోగ్యంతో బాధ పడుతున్న కొండమూది రమేష్(31) వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథన ప్రకారం అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామానికి చెందిన కొండమూది రమేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఈ నెల 17న పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో.. వెంటనే గుంటూరు ప్రభుత్వం వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్ఐ షరీఫ్ తెలిపారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించామని, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల కాపరి మృతి

ఫిరంగిపురం: విద్యుత్‌షాక్‌తో గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని 113 త్యాళ్లూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంపతి వెంకటేశ్వర్లు(65) తన మేకలను పొలాల వద్దకు మేతకు తీసుకువెళ్లాడు. కర్రకు కొడవలి కట్టి చెట్టు పైనున్న కొమ్మలు కోస్తూ ఉన్న క్రమంలో విద్యుత్ తీగలకు కొడవలి తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడనే మృతి చెందాడు. కుమారుడు కోటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపల్లెలో గోవుల మంద..



పద్మావతి సెంటర్‌లో రహదారిపై బస్సుకు అడ్డంగా ఆవుల మంద



అంబేడ్కర్ పార్కు పక్కనే పడవేసిన మాంసపు వ్యర్థాలను తింటున్న కుక్కలు

- రహదారులకు అడ్డంగా పడక
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- ప్రమాదాల కారణంగా తరచూ గాయాలు
- వీటికి తోడు పట్టణంలో ఎక్కువైన కుక్కల బెడద
- దాడి చేస్తూ..గాయపరుస్తూ.. హల్‌చల్



రింగు రోడ్డు సెంటరులో రహదారిపై ఇలా..

రేపల్లె రూరల్: పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. ఆవుల మంద రోడ్లకు అడ్డంగా ఉండటంతో వాహన చోదకులు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. విచ్చలవిడిగా రహదారిపై సంచరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా పెద కూరగాయల మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల, బస్టాండ్ సెంటరు, పండ్ల మార్కెట్, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పద్మావతి థియేటర్ సెంటర్, నిజాంపట్నం రహదారుల్లో ఆవులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. ఆవులు రోడ్లపై అడ్డంగా పడుకుని ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సందార్భాలలో వాహనాలు ఢీకొనటంతో ఆవులు ప్రమాదాల భారిన పడిన ఘటనలూ ఉన్నాయి. ఆవుల సంచారాన్ని అరికట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని పట్టణ ప్రజలు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.

కుక్కల బెడదను తొలగించాలి:
ఆవులతో పాటు కుక్కల బెడద సైతం పట్టణంలో అధికంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు కుక్కలు అడ్డు పడటంతో పలు సందర్భాలలో ప్రమాదాలకు గురై, తీవ్రంగా గాయపడుతున్నారు. అదేవిధంగా పాదాచారులు రహదారులు వెంబడి వెళ్లే సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. పలు హోటళ్ల వారు మిగిలిన మాంసపు వ్యర్థాలను ప్రధాన రహదారుల వెంబడి పడవేయటంతో వాటిని తినేందుకు కుక్కలు అధిక సంఖ్యలో ఎగబడుతున్నాయి. మాంసపు వ్యర్థాలు తినే క్రమంలో కుక్కల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ కారణంగా అవి మనుషులపై దాడులు చేసి, గాయపరుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులపైకి సంచరించే ఆవులను గో సంరక్షణ శాలకు, వీధి కుక్కలను వేరే ప్రదేశాలకు తరలించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..



పశువులు, కుక్కలతో వాహన చోదకులు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. పట్టణంలో పశువులను రహారులపైకి రాకుండా మైక్ ద్వారా ప్రచారం నిర్వహించటంతో పాటు, పశు యజమానులకు నోటీసులు పంపటం జరుగుతుంది. రహదారులపై గోవులు, పందులు, కుక్కలు సంచరిస్తే ఇక నుంచి వీటిని గోశాలకు గాని, అడవుల్లో గాని వదిలి పెట్టటం జరుగుతుంది.

– శేషాద్రి, మున్సిపల్ కమిషనర్, రేపల్లె.

రూ.29.24కోట్ల పంట నష్ట పరిహారం జమ

- రేపల్లె నియోజకవర్గంలో రైతుల ఖాతాల్లోకి నగదు
- వ్యవసాయశాఖ ఏడీఏ అక్తర్ హుస్సేన్

రేపల్లె రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం వారి ఖాతాలలో నేరుగా జమచేయటం జరిగిందని వ్యవసాయశాఖ రేపల్లె సబ్ డివిజన్ ఏడీఏ అక్తర్ హుస్సేన్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 17,194 హెక్టార్లలో నష్టపోయిన 28,195 మంది రైతులకు రూ.29.24కోట్లు పరిహారం ప్రభుత్వం నుంచి విడుదలైందని తెలిపారు. రేపల్లెలో 6,964 మంది రైతులు 4,076 హెక్టారులలో పంట నష్టపోగా వీరికి రూ.6.92కోట్లు పరిహారం అందిందన్నారు. నిజాంపట్నం మండలంలో 5,237 మంది రైతులకు 2,806 హెక్టార్ల పంటనష్టం రూ.4.77 కోట్లు అందిందన్నారు. చెరుకుపల్లిలో 7007 మంది రైతులు 4,035 హెక్టారులలో పంట నష్టపోగా రూ.6.86కోట్లు, అదే మండలంలో ఉద్యాన పంటలు 7.119 హెక్టారులలో 25 మంది పంట నష్టపోగా వీరికి రూ.1.21 లక్షలు పరిహారం అందిందన్నారు. మొత్తంగా చెరుకుపల్లి మండలానికి అగ్రికల్చర్, హార్టికల్చర్ సాగు చేసే రైతులకు రూ.6.87 కోట్లు నష్టపరిహారం అందినట్లు చెప్పారు. నగరం మండలంలో 8,987 మంది రైతులు 6,277 హెక్టారులలో పంట నష్టపోగా రూ.10.67కోట్ల నష్ట పరిహారం వారి ఖాతాల్లో జమ అయ్యిందన్నారు.

తూర్పుసత్రం స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే చూస్తూ ఊరుకోం

కాపు సంఘం నాయకులు

బాపట్లటౌన్: తూర్పు సత్రం స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే చూస్తూ ఉరుకోబోమని కాపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తూర్పు సత్రం స్థలం విషయంపై దేవాదాయ శాఖ ఈవోకు వినతిపత్రం అందజేశారు. కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం, పుర ప్రజల సౌకర్యార్థం పేరం గురుడాచలం నాయుడు దానం చేసిన భూమిని ఏవో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేవిధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా తూర్పుసత్రంలో కొలతలు తీయడం హేయమైన చర్య అన్నారు.
సమాచార హక్కు చట్టం వర్తించని దేవాదాయ శాఖకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎందుకు వర్తించదన్నారు. ఐటీసీఎల్ కంపెనీకు తూర్పుసత్రం స్థలాన్ని కట్టబెడితే కాపు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడం ఖాయమన్నారు. ఈ స్థలాన్ని కేవలం పట్టణంలోని ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈవోకు వినతి పత్రం అందించిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి, జనసేన నాయకురాలు తులసీకుమారి, కాపు సంఘం నాయకులు పర్వతరెడ్డి భాస్కరరావు, అడ్వకేట్ విన్నకోట సత్యప్రసాద్, కొట్రా కొండలు, తులసీసాయిదాస్, లేళ్ల వెంకటప్పయ్య పాల్గొన్నారు.



దేవదాయశాఖ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కాపు సంఘం నాయకులు

పచ్చిరోట్ట పైరుతో భూమి సారవంతం

- 50శాతం సబ్సిడీపై పచ్చిరోట్ట విత్తనాలు పంపిణీ
- అందుబాటులో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు



ఏవో రమేష్‌బాబు

నగరం: పచ్చిరోట్ట విత్తనాలు సాగుచేయడం వల్ల పంట పొలాలు సారవంతమవుతాయని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పచ్చిరోట్ట విత్తనాల సాగుపై దృష్టి సారించాలన్నారు. 50 శాతం సబ్సిడీపై పచ్చిరోట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మండలానికి 60 క్వింటాళ్ల జీలుగ, 30 క్వింటాళ్ల జనుము, 20 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. ఎకరానికి జీలుగ, జనుము 10 కేజీలు, పిల్లి పెసరలు 8 కేజీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జీలుగ, జనుము విత్తనాలు కేజీ రూ.44, పిల్లి పెసర కేజీ రూ.67లకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

భట్టిప్రోలులో 82.73 శాతం పోలింగ్

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో వేమూరు నియోజకవర్గం పరిధిలోని భట్టిప్రోలు మండల ఓటర్లు చురుగ్గా పాల్గొన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో పోలైన ఓట్ల వివరాలను తహసీల్దారు ఐ. మునిలక్ష్మి తెలిపారు. మండలంలో 42,096 మంది ఓటర్లకుగాను 35,659 మంది ఓట్లు వేశారు. వారిలో 17,525 మంది పురుషులు, 18,131 మంది స్త్రీలు, ముగ్గురు ఇతరులు ఓటు వేశారు. ఇక్కడ 82.73 శాతం ఓట్లు పోలైనట్లు ప్రకటించారు.

ప్రారంభమైన ఆత్మ సంయమయోగః ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత - ఆత్మసంయమయోగః ధారావాహిక ప్రవచన కార్యక్రమాలు మొదలయ్యాయి. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో సువీరానంద స్వామి చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 వరకు నిర్వహించనున్నారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో సన్యాసమని పిలిచినది యోగమని తెలుసుకోవాలని అన్నారు. సంకల్ప త్యాగం చేయని వారు యోగి కాలేరని పేర్కొన్నారు.

ఆత్మీయ పలకరింపు..



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లి మునిస్వామి నాయుడు స్మారకోన్నత జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ పలకరింపులతో సందడి నెలకొంది. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తమ బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు డి.వెంకట్రావు, ఆర్.వెంకటేశ్వరరావు, ఆచారి, బి.లలితాదేవి, మురళి, పి.వెంకటేశ్వరరావు, ప్రసాద్‌లతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు రత్నకుమారి, సూరిబాబు, తరుణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించి, ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కె.ముకుంద మోహన్, కె.నరేంద్రబాబు, ఎ.మధుసూదనరావు, కె.భాస్కర రామయ్య, రత్నకుమారి, యు.కృష్ణారావు, బుల్లయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫలితాల రోజు 144 సెక్షన్ అమలు

ఎస్ఐ వి. సోమేశ్వరరావు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): ఎన్నికల ఫలితాల రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామమైన పాతమల్లాయపాలెంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజున శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఏ ఒక్కరు వ్యవహరించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే గ్రామంలో గతంలో వివాదాలు, కొట్లాటలు, అల్లర్లలో ప్రమేయమున్న కొందరు వ్యక్తులను బైండోవర్ చేశామని, మరికొందరిని త్వరలో బైండోవర్ చేయనున్నామని చెప్పారు. ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినప్పటికీ ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించడం ద్వారా గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. ఇరుపార్టీల నాయకులు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎన్నికల కేసుల్లో పేర్లు నమోదైతే జీవితాంతం వెంటాడుతాయని హెచ్చరించారు.

అభివృద్ధిలో మీమాంస దేనికీ..



శిథిలావస్థకు చేరిన మాంసం మార్కెట్

- శిథిలావస్థలో మాంసం మార్కెట్ భవనం
- రూ.లక్షల ఆదాయం సమకూరుతున్నా మున్సిపాలిటీ నిర్లక్ష్యం
- స్లాబు పెచ్చులూడుతూ వ్యాపారానికి ఆటంకం
- విరిగిన గేట్లతో రక్షణ కరువు, నీరు రాక కొళాయిలు వెలవెల
- సమస్యలు పరిష్కరించాలంటున్న దుకాణదారులు



ప్రధాన ద్వారంలోని విరిగిన గేట్లు

పొన్నూరు: నిడుబ్రోలులోని పురపాలక సంఘ మాంసం మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో పలు సమస్యలతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిష్కరించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. పురపాలక సంఘ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాల క్రితం మార్కెట్ నిర్మితమైంది. 12 దుకాణాల్లో ప్రస్తుతం మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. ఏటా రూ.30 లక్షల వరకు దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. అయితే ఏళ్లు గడిచినా దుకాణ సముదాయం తాత్కాలిక మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. ప్రధాన ద్వారంలో ఐరన్ గేట్లు విరిగిపోవడంతో మార్కెట్‌కు రక్షణ కరువైంది. మార్కెట్‌లోని దుకాణాల్లో నీటి కొళాయిలు వినియోగానికి నోచుకోవడం లేదు. భవనం స్లాబు పెచ్చులూడి పడుతోంది. దీంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్ ద్వారంలోని గేట్లకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాపారం సరిగా చేయలేకపోతున్నా..



మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో వ్యాపార నిర్వహించలేకపోతున్నాం. ద్వారంలోని ఐరన్ గేట్ లు పూర్తిస్థాయిలో విరిగిపోయాయి. దుకాణాలలో తాగు నీటి కొళాయిలు పనిచేయడం లేదు. స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నాను .

– షేక్ గఫార్, లీజుదారుడు







పట్టణంలో కురుస్తున్న వర్షం

జల దారులు

రేపల్లె రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత మూడు రోజులుగా రేపల్లె తీర ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం అరగంటకు పైగా కురిసిన వర్షంతో పట్టణంలోని రహదారులు కాస్త జల దారులయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఉదయం 10 గంటల వరకు ఎండ కాయగా.. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా కురిసిన కుండ పోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, నిజాంపట్నం రోడ్డులతో పాటు పలు రహదారులు పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ప్రకాశం రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్‌లోని డ్రైయినేజీ మురుగు నీరు వర్షపు నీటితో కలిసి రోడ్డుపైకి చేరడంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితంగా మారింది.

పట్టాలపైకి పశువులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రామీణ ప్రాంతవాసులకు అవగాహన కల్పించిన ఆర్పీఎఫ్ పోలీసులు



పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణదాసు

లక్ష్మీపురం: రైలు పట్టాలపై మూగ జీవాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహిస్తే మూగ జీవాలతో పాటు రైలు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఎస్ఐ కృష్ణ దాసు తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని పెదకూరపాడు పరిసర ప్రాంతాలలో తాను.. రెడ్డిపాలెం, సిరిపురం పరిసర ప్రాంతాలలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు పశువుల కాపురులకు గుంటూరు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ సీఐ ఆర్.వీరబాబు ఆదేశాల మేరకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులను, మూగ జీవాలను రైలు పట్టాలపై రానివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. రైలు పట్టాలపై మూగ జీవాలను నిర్లక్ష్యంగా వదిలేస్తే, దాని వల్ల కలిగే ప్రమాదాలకు రైలు రాకపోకల ఇబ్బందులకు పశువుల యజమానులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పశువుల కాపురులకు పలుమార్లు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు. ఇటీవల పెదకూరపాడు, బండారు పల్లి, సిరిపురం ప్రాంతాల్లోని రైలు పట్టాలపై పశువుల పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఈ ప్రమాదం జరగడం ద్వారా రెండు రైళ్ల రాకపోకలు నిలిచి పోవడం జరిగిందన్నారు. పశువులను రైలు పట్టాలపై వదిలిన యజమానులైన ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తమామలే మృతికి కారణమంటూ మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు



తాడికొండ: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుళ్లూరు గ్రామానికి చెందిన గొడవర్తి డేవిడ్ పెద్ద కుమార్తె సుకన్య(26)కు రాయపూడి గ్రామానికి చెందిన విజయ్ బాబుకు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. తదనంతరం భార్య భర్తలు విజయవాడలో కాపురం పెట్టగా ఇటీవల కాలంలో రాయపూడిలోని భర్త ఇంటికి వచ్చి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తుళ్లూరు పుట్టింటికి వచ్చిన సుకన్య ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తుళ్ళూరు సీఐ అనురాధ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా.. గత కొంత కాలంగా అత్త, మామ, భర్త కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి 7 నెలల పాప ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనురాధ తెలిపారు.